సాక్షి
బాపట్ల
గురువారం । 8 । మే । 2025



## కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: చెంచుపేట ఆర్‌పీఎం క్లబ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు బుధవారం కూడా కొనసాగింది. మురుగు కాల్వలపై ఆక్రమణలను అధికారులు పూర్తిగా తొలగించారు.



## కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

దాచేపల్లి: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి హోమం, శాంతి హోమం నిర్వహించాక లక్ష మల్లెల పూజలు చేశారు.



## నేడు ఆలయ ప్రతిష్టా వేడుకలు

శావల్యాపురం: కృష్ణాపురంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విగ్రహాల జలాభిషేకం జరిగిందని, గురువారం ప్రతిష్టా వేడుకలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### రోడ్ల నిర్మాణాలు పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ బృందం



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు సీసీ రోడ్ల నాణ్యతను బుధవారం గుంటూరు నుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ సభ్యులు పరిశీలించారు. యడ్లలింగయ్య కాలనీలో-6, అమరావతి ప్లాట్స్ స్విమ్మింగ్ పూల్ దగ్గర, పూలే కాలనీ, చెంచుపేట రత్నశ్రీ పబ్లిక్ స్కూల్ దగ్గర, గంగానమ్మపేట శివాలయం వద్ద నిర్మించిన పలు రోడ్లను పరిశీలించి, వాటికి నాణ్యత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈలు సూరిబాబు, సునీల్, జానీ బాషా పాల్గొన్నారు.

### పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మదిర షానూన్ సత్తా



మంగళగిరి: ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో ఈనెల 6న జరిగిన ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొన్న పవర్ లిఫ్టర్ మదిర షానూన్ 47 కేజీల విభాగంలో సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర రావు, షేక్ సంధాని తెలిపారు. తెనాలికి చెందిన షానూన్ అక్కడే ఉన్న క్విక్ ఫిట్నెస్ ఎరినాలో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి వద్ద శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన షానూన్‌ను రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలియజేశారు.

### శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం



మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం భగవత్ ప్రార్థన, ఆచార్య స్తోత్ర పాఠం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విగ్వరణం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్వామికి పంచామృత స్నపన, తిరుమంజనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం రామలక్ష్మణస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హనుమద్వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

### తెనాలిలో సదరం క్యాంప్ పునఃప్రారంభం



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్ర వారాల్లో కూడా క్యాంప్ జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

# ఉద్రిక్తత.. అప్రమత్తత

- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై పోరు వేళ సన్నద్ధత
- జిల్లాలో మాక్ డ్రిల్ నిర్వహించిన పోలీసు ఉన్నతాధికారులు
- అందరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచన

బాపట్ల టౌన్: విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నందున సంక్షోభ సమయంలో పౌరులు తమను తాము ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై బుధవారం బాపట్ల రైల్వేస్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీలు సూర్యలంకలో జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ ప్రస్తుతం భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అనుకోని ప్రదేశంలో అగ్రవాదులు దాడులకు పాల్పడితే జిల్లాలోని అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రైల్వే స్టేషనులోకి ఇద్దరు దుండగులు వచ్చి కాల్పులు జరిపినట్లు మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా రైల్వేస్టేషన్‌లో ఇద్దరు ఆగంతుకులు దాడులకు పాల్పడుతున్నారని రాబడిన సమాచారం మేరకు పోలీస్, ఫైర్, రైల్వే, రెవెన్యూ, వైద్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పది నిమిషాల వ్యవధిలోనే రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. తనిఖీలు చేయడం ప్రారంభించారు.



మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను తరలిస్తున్న పోలీసులు

రైల్వేస్టేషన్‌లో ఉన్న ప్రయాణికులను సురక్షితమైన ప్రదేశానికి తరలించారు. గాయపడిన వారికి వైద్యుల సహాయంతో ప్రథమ చికిత్స అందించి హాస్పిటల్‌కు తరలించినట్లు చూపారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ ప్రజలు అధైర్య పడవద్దని, జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా, బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్, రైల్వే, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో పోలీసులు

### దాడి జరిగితే ఎదుర్కొనేలా ఏర్పాట్లు

ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో రాబోయే విపత్తులను ఎదుర్కొనేందుకు అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. బుధవారం ఉదయం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దళాధిపతులు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విపత్తు నివారణ సంస్థల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా శత్రువుల దాడి జరిగే అవకాశం ఉందని ప్రమాద హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు పరిస్థితులు ఏర్పడితే పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. శత్రువుల దాడిలో సాధారణ పౌరుల ప్రాణాలకు ఎలాంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రజలకు తక్షణమే వైద్య సహాయం ఎలా అందించాలి, ఏదైనా ప్రమాదం జరిగితే ఏం చర్యలు తీసుకోవాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒక వేళ రైల్వేస్టేషన్, రహదారులు, చెరువులపై దాడి జరిగితే తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించామని తెలిపారు. వాయుసేన అధికారులతో కలిసి మాక్ డ్రిల్ చేసి పరిస్థితులను అంచనావేశామని తెలిపారు. శత్రువుల దాడి హెచ్చరికల నేపథ్యంలో సూర్యలంక సముద్రమార్గం వద్ద నిరంతర నిఘా మరింత పెంచామని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సీడీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా విపత్తు నిర్వహణ, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

పూటకో మాట.. రోజుకో అబద్ధం.. ఇలా కూటమి ప్రభుత్వం తీరుతో సంక్షేమం గాలిలో దీపంలా మారింది. హామీల నావ మునిగిపోయింది. పాలకుల తీరుతో పేదల కడుపు మాడుతోంది. రేషన్ ద్వారా కందిపప్పు సరఫరా నిలిచిపోయి నాలుగు నెలలుగా లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

# డప్పు కొట్టినా 'పప్పు' రాలేదు!

- రేషన్ సరకులపై మాటలతో కూటమి ప్రభుత్వం ఆర్భాటం
- కందిపప్పు పంపిణీ అంటూ ప్రచారం
- నాలుగు నెలలుగా కార్డుదారులకు నిలిచిపోయిన సరఫరా
- పేదలకు కేవలం బియ్యంతోనే సరిపెడుతున్న సర్కారు

వేటపాలెం: పేదల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా రేషన్ సరకుల్లో కందిపప్పు పంపిణీ చేయకుండా చేతులెత్తేయడంతో లబ్ధిదారులు లోబోదిబో అంటున్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నాయుడు కనీసం పేదలకు కందిపప్పు కూడా పంపిణీ చేయలేయపోతున్నారని కార్డుదారులు మండి పడుతున్నారు. ప్రతి నెలా అందించే రేషన్ సరకుల్లో భారీగా కోత పడుతోంది. కార్డుదారులకు అన్ని రకాల సరకులు అందడం లేదు. రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర తప్ప మిగిలిన నిత్యావసరాల మెనూ కానరావడం లేదు. మే నెలలోనైనా కందిపప్పు సరఫరా చేస్తారనుకుంటే ఈ సారీ కూడా ఊసేలేదు. జిల్లాలో 4,76,529 లక్షల మంది, చీరాల నియోజకవర్గ పరిధిలో 67,672 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు.



రేషన్ బియ్యం అందిస్తున్న వాహనం వద్ద లబ్ధిదారులు (ఫైల్)

**ఈ ఏడాది ఇలా..**

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి కంది పప్పు ఇవ్వకుండా బియ్యం, చక్కెరతోనే సరిపెట్టారు. కందిపప్పుకు మార్కెట్‌లో ధర పెరగడం తోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెట్టినట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ. 150 పలుకుతుంది. ఇంత వెచ్చించడం పేద, సామాన్య ప్రజలకు భారంగా మారింది.

### గత ప్రభుత్వంలో ఇంటింటికీ సరఫరా..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఇంటింటికీ నిత్యావసర సరకులు పంపిణీ అయ్యాయి. నాలుగేళ్లపాటు పేదలకు పంపిణీ దిగ్విజయంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కార్డుదారులకు మొండిచేయి చూపుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం 9 రకాల నిత్యావసర వస్తువులు ఇస్తామని చెప్పినదంతా ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణ శూన్యం అని మండిపడుతున్నారు.

### కందిపప్పు సరఫరా లేదు

ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా చేయడం లేదు. ఇప్పటివరకు మాకు సర్కారు నుంచి ఎటువంటి సమాచారం లేదు. ప్రభుత్వం సరఫరా చేస్తే రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తాం.

విలియమ్స్, డీఎస్‌ఓ, బాపట్ల

# ఇసుక క్వారీలో ఆర్డీవో తనిఖీ

**నదిలో నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ సీజ్**

కొల్లూరు : కృష్ణా నదిలో ఉచిత ఇసుక క్వారీని అడ్డుపెట్టుకొని అధికార పార్టీ నాయకులు సాగిస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు ఎట్టకేలకు అధికారులు కదిలారు. బుధవారం 'సాక్షి'లో 'పచ్చ దందా.. రేణువైనా మిగులుతుందా?' శీర్షికతో మండలంలోని గాజుల్లంక వద్ద కృష్ణా నదిలోని గాజుల్లంక-2 ఇసుక క్వారీలో యంత్రాలతో ఇసుక అడ్డగోలు తవ్వకాలపై కథనం వచ్చింది. స్పందించిన రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి బుధవారం క్వారీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తర్వాత గాజుల్లంక కృష్ణా నది వద్దకు చేరుకున్నారు. ఉచిత ఇసుక క్వారీ డంపింగ్ ప్రదేశానికి సమీపంలో నుంచి క్వారీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నదిలో యంత్రాల సాయంతో ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న లారీని గమనించారు. వెంటనే అప్రమత్తమైన లారీని నిలుపుదల చేయించారు.యంత్రాలతో ఇసుక నింపడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె లారీని సీజ్ చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించాలని తహసీల్దార్ ఆదేశించారు. సీజ్ చేసిన లారీపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసును తహసీల్దార్‌కు బదిలీ చేయడంతో ఆయన రూ. 25 వేలు జరిమానా విధించారు.

సాక్షి ఎఫెక్ట్



ఇసుక క్వారీ పరిశీలనలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి



లారీని సీజ్ చేయాలని ఆదేశిస్తున్న ఆర్డీవో

# అకాల వర్షంతో తీరని నష్టం

**వాన బారినపడిన మొక్కజొన్న కండెలు**



అరవింద వారధి వద్ద ఆరబెట్టిన మొక్కజొన్న చుట్టూ నీరు చేరడంతో తోడుతున్న రైతులు



రేపల్లె-తెనాలి ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోయిన వర్షపు నీరు

కొల్లూరు: అకస్మాత్తుగా మబ్బులు కమ్ముకొచ్చి అర్ధగంటపాటు కురిసిన భారీ వర్షం కారణంగా ఇటుక పరిశ్రమకు నష్టం వాటిల్లింది. పరిశ్రమ చివరి దశకు చేరుకునేలోపు మూడు సార్లు కురిసిన వర్షాలతో పచ్చి ఇటుక భారీగా తడిసిపోయి ఉత్పత్తిదారులు రూ. కోట్లలో నష్టాలపాలయ్యారు. బుధవారం మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా ఇటుక రాయి తయారీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. పచ్చి ఇటుక ఎందుకూ పనికిరాకుండా పోయింది. సుమారు 50 లక్షల వరకు పచ్చి ఇటుక తడిసి దాదాపు రూ. 2 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బట్టీలు పూర్తి చేయడానికి అవసరమైన ఇటుక కోసం తిరిగి పచ్చి ఇటుకను తయారు చేయించడం, తడిసిన ఇటుకను తొలగించడం వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం అని ఉత్పత్తిదారులు వాపోతున్నారు.

**మొక్కజొన్న రైతులకు కష్టాలు**

మొక్కజొన్న పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో వర్షం కురవడంతో లంక గ్రామాల మెట్ట భూములలో కల్లాలలో ఆరబెట్టిన కండెలు తడిసిపోయాయి. వర్షం ఆరంభమయ్యే సమయంలో గింజలు, కండెలు తడవకుండా టార్పలిన్‌లతో కప్పుకున్నప్పటికీ భారీ వర్షంతో తడిసిపోయాయి.

**స్తంభించిన ట్రాఫిక్**

వర్షం కారణంగా రహదారులు జలమయమై ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులకు గురయ్యారు. రేపల్లె-తెనాలి ప్రధాన రహదారిపై కొల్లూరు గౌడపాలెంలో భారీగా నీరు చేరింది. అదే సమయంలో మురుగు కాలువలు పొంగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలలోని గృహాలలోకి చేరింది.

# ధైర్యానికి ప్రతీక అల్లూరి

**మాజీ డెప్యూటీ స్పీకర్ కోన**

బాపట్ల ధైర్యానికి ప్రతీక అల్లూరి సీతారామరాజు అని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక చీలురోడ్డులోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, విప్లవజ్యోతి వెలిగించిన మహానుభావుడు అల్లూరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, చల్లా రామయ్య, నర్రావుల వెంకట్రావు తదితరులు ఉన్నారు.

**క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో...**

క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో సూర్యలంక రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే అనంత వర్మ రాజు, నాయకులు సలగల రాజశేఖర్ బాబు, శ్రీమన్నారాయణ, గంటా అంజి బాబు, పఠాన్ రాజేష్ పాల్గొన్నారు. క్షత్రియ సేవా సంఘం సభ్యులైన అధ్యక్షులు మంతెన ఆనంద గజపతి రాజు, ఉపాధ్యక్షులు పెను మోచ్ప నటరాజు, కార్యదర్శి కె. భాస్కర రాజు, చంపాటి జయ నాగరాజు, ఎం. విష్ణువర్ధన్ రాజు, కనకరాజు, హరే రామరాజు, శ్రీనివాసరాజు, రామకృష్ణంరాజు హాజరయ్యారు.

**కలెక్టరేట్‌లో...**

స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ ఉన్నారు.

**ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల్లో...**

ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అల్లూరి వర్ధంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు ఎం.సర్దార్‌బేగ్ నివాళి అర్పించారు. ఆంగ్లేయులపై పోరాటంలో అల్లూరి కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. అధ్యాపకులు డాక్టర్ ఈ. గౌతమి, డాక్టర్ సి.హెచ్. సోమేశ్వరరావు, డాక్టర్ ఎస్.వినోద, డాక్టర్ ఎస్ బ్లెస్సి సాగర్, వై. అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే



నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్



సాహితి భారతి ప్రతినిధులు..

**సాహితిభారతి ఆధ్వర్యంలో...**

అల్లూరి సీతారామరాజు వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్, ఆచార్య ఆత్రేయల జయంతి సభ సాహితి భారతి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ ఖాదర్ జీలాని అధ్యక్షతన సాహితీ భారతి ఆధ్వర్యంలో బాపట్ల జమేదారు పేటలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రావూరి నరసింహ వర్మ, ఎం. మాల్యాద్రిరావు, ఎం. జాకబ్, దగ్గుమల్లి శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

- త్వరగా నిర్మాణ పనులు పూర్తి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్: అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలందరి సహకారంతో సాధ్యమైనంత త్వరగా శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం శంకర్ విలాస్ పునఃనిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనంద్‌బాబు, కన్నా లక్ష్మీనారాయణ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి పెమ్మసాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ విషయంలో కొన్ని అపోహలు ఉన్నాయని..వాటిన్నింటిని తీరుస్తామని చెప్పారు. ఆర్వోబీ కట్టిన తరువాత కూడా ఆర్‌యూబీ నిర్మించేందుకు భవిష్యత్తు కార్యచరణ సిద్ధం చేశామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంతో కొంత మేర ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నప్పటికీ సహకరించాలని ఆయన కోరారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న దేవాలయాలు, చర్చిలు, మసీదులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని...వారికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా జీవనోపాధి దెబ్బతినే వారికి పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని తెలిపారు. దీర్ఘకాల ప్రయోజనాల కోసం కొన్ని ఇబ్బందులు తప్పవన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రెండు నెలలుగా బ్రిడ్జి నిర్మాణానికి అన్ని శాఖల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. బ్రిడ్జి నిర్మాణం వేగవంతంగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాల్ని నగరపాలక సంస్థ తరపున అందిస్తామని హామీ ఇచ్చారు.



శంకుస్థాపనలో పాల్గొన్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుర్గేష్

### బీజేపీ నేతల అసంతృప్తి

శంకర్ విలాస్ బ్రిడ్జి శంకుస్థాపనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావుకు ప్రాధాన్యత కల్పించక పోవడంపై ఆ పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శిలాఫలకం వద్దకు బీజేపీ జిల్లా అధ్యక్షుడిని ఆహ్వానించకుండానే శంకుస్థాపన చేయడంపై మండిపడ్డారు.

## క్లుప్తంగా

### భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి



కర్లపాలెం: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పైర్లకు ఎరువులు వేయాలని ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. కర్లపాలెం గ్రామ సచివాలయంలో భూసార పరీక్షలపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో భూములకు మట్టి నమూనా పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. రైతులు తమ సాగు భూములలోని మట్టి నమూనాలు సేకరించి గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని తెలిపారు. బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ హుస్సేన్ మాట్లాడుతూ చౌడు భూములను సారవంతం చేసుకునేందుకు ముందుగా పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి పూతదశలో భూమిలో కలియదున్నుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారులు సూచించిన మోతాదు మేరకు రైతులు పైర్లకు ఎరువులు వేయాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు భ్రమరాంబదేవి, రైతులు పాల్గొన్నారు.

### రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



రేపల్లె: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రేపల్లె స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. తీర ప్రాంతంలో చిట్టచివరి రైల్వేస్టేషన్ అయిన రేపల్లెను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని వసతులతోపాటు భవన నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజాసంఘాల నాయకులు ఆమెకు వినతిపత్రాలను అందజేశారు. డీవోఎం శ్రీనాథ్, డీఈఎన్ శేషు, డీఈడబ్ల్యూ సుదర్శన్, నాయక్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

### గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా చర్లపల్లి–బెరహంపూర్‌కు ప్రత్యేక రైలును ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి–బెరహంపూర్ రైలు (07027) ప్రతి శుక్రవారం వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 9,16,23,20 తేదీలు, జూన్ 6,13,20,27వ తేదీల్లో నడుస్తుందని పేర్కొన్నారు. బెరహంపూర్–చర్లపల్లి రైలు (07028) ఈ నెల 10,17,24,31 తేదీలు, జూన్ 7,14,21,28 తేదీల్లో నడుస్తుందని తెలియజేశారు. ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.

# షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి బుగ్గిపాలు

రూ.6 లక్షల మేరకు ఆస్తినష్టం



మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బంది



కొప్పరపాడులో అగ్నిప్రమాదంలో కాలిపోయిన బైక్, టీవీ



ప్రమాదంలో కాలిపోయిన డబుల్ కాట్ మంచం

బల్లికురవ: బతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటిన కొందరు పరదాలు అద్దెకు ఇచ్చేందుకు వలస వెళ్లారు. ఇక్కడ ఇళ్లకు తాళాలు వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి వారికి చెందిన మూడు ఇళ్లలో గృహోపకరణలు, బైకులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి బల్లికురవ మండలంలోని వి.కొప్పరపాడు గ్రామంలోని తుగాలిల కాలనీలో జరిగింది. కాలనీలోని మూడావత్ హనుమానాయక్, ఆయన కుమారులు రాజునాయ్, కృష్ణానాయక్ ఒకే ఇంటిని పోర్షన్‌లుగా చేసుకుని వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. రెండు నెలల క్రితం ఇళ్లకు తాళాలు వేశారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పరదాలు తీసుకుని వలస వెళ్లారు. వారి ఇంట్లో నుంచి మంటలు చెలరేగటంతో ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో అవి పేలుతాయేనన్న భయంతో లోపలికి వెళ్లేందుకు భయపడ్డారు. అద్దంకి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి వెంకటరావు తమ సిబ్బందితో కాలనీకి వచ్చారు. మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో సుమారు రూ. 6 లక్షలపైగా ఆస్తి నష్టం వాటిల్లింది.

## సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రైతు సంఘ నాయకులు



సాంబయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నేతలు

పర్చూరు(చినగంజాం): పొగాకు సాగు చేపట్టి అప్పులపాలై మృతి చెందిన ఉప్పుటూరి సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన పొగాకు రైతు సాంబయ్య బలవన్మరణం చెందడంతో బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సీహెచ్ గంగయ్య, టి. రామారావు, పి. కొండయ్య, శ్రీనివాసరెడ్డి, మక్కెన వెంకన్న, డేవిడ్ తదితరులు సాంబయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గతేడాది మూడు ఎకరాలు పొగాకు సాగు చేశాడని, వచ్చిన దిగుబడి తనకున్న అప్పులు కట్టేందుకు సరిపోవని పొగాకు అమ్మకుండా నిల్వ ఉంచుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంవత్సరం అప్పులు తెచ్చి మళ్లీ 5 ఎకరాలు సాగు చేశాడని పేర్కొన్నారు. ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక తాను పెట్టిన ఖర్చులు కూడా వచ్చే పరిస్థితులు లేకపోవడంతో మంగళవారం వేకువ జామున బలవన్మరణానికి పాల్పడ్డాడని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సాంబయ్య కుమారుడు పదో తరగతి మంచి మార్కులతో పాసయ్యాడని, కుమార్తె ఇంటర్ సెకండియర్ చదువుతోందని కుటుంబసభ్యులు తెలిపారు. వారి చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. సాంబయ్యకు ఎకరా సొంత భూమి ఉన్నందున భవిష్యత్‌లో కుటుంబ బాధ్యత, పిల్లల చదువులు సాంబయ్య భార్యకు మరింత భారం అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

### వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నేతల దాడి



వెల్దుర్తి: మండలంలోని బోదిలవీడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అత్తులూరి హనుమంతరావుపై అదే గ్రామానికి చెందిన కంకనంపాటి పాపయ్య, మందలపు రాజేష్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. హనుమంతరావు పొలానికి వెళ్లి తిరిగి వచ్చిన సందర్భంలో బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు ఆయనపై రాళ్లు, కర్రలతో దాడి చేయటంతో గాయాలపాలయ్యాడు. బంధువులు హనుమంతరావును మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### క్షేత్ర సహాయకుల తొలగింపు

నరసరావుపేట: వివిధ మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న తొమ్మిదిమంది క్షేత్ర సహాయకులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరక్టర్ సిద్దలింగమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పత్రికలకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వర్క్‌సైట్‌లో ఒక వర్క్ ఐడీకి సంబంధించిన ఒకటే ఫొటోను వివిధ వర్క్ ఐడీలకు పంపినట్లుగా నివేదిక ద్వారా రుజువైందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మాదుగుల పంచాయతీలోని ఎల్.అలేఖ, బెల్లంకొండ: కె.వెంకటేష్, కొప్పునూరు: కె.మరియదాసు, ఇర్లపాడు: బి.వీరాంజనేయులు, శావల్యాపురం: సీహెచ్.బాలకృష్ణ, వెల్లటూరు: ఏ.ప్రియాంక, రేమిడిచర్ల: టి.మనెయ్య, పిట్టంబండ: వై.మమత, దొండపాడు పంచాయతీలోని ఎం.అనూషలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ నోటీసు జారీ చేశారు.

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.

## బైక్ చోరీ కేసులలో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: బైకుల చోరీల కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. గుంటూరు నగరం ఇస్లాయిల్‌పేటకు చెందిన షేక్ సుభాని (ప్రస్తుతం చిలకలూరిపేటలో నివాసం), విజయవాడకు చెందిన పఠాన్ ఆవేజ్‌ఖాన్‌లు కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. ద్విచక్ర వాహనాల చోరీలు ఇటీవల అధికం కావడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కింగ్ హోటల్ సమీపంలోని దుకాణం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం విక్రయిస్తున్న సుభాని, ఆవేజ్ ఖాన్‌లను ఎస్ఐ విజయ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ఇద్దరూ గత ఏడాది నుంచి మారు తాళాలు తయారు చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. చోరీ చేసిన వాహనాలను ఆటోనగర్ ప్రాంతంలోని ఓ మెగా హాస్పిటల్ వెనుక భాగంలో దాచి ఓఎల్ఎక్స్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు వెల్లడైందన్నారు. పక్కా సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రూ. 8.50 లక్షల విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై 16 కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

## అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

యువతకు ఎస్పీ తుషార్‌డూడీ సూచన



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

బాపట్ల టౌన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. అల్లూరి వర్ధంతిని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ... బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన గొప్ప విప్లవకారుడు అల్లూరి అని కొనియాడారు. వీరోచిత సాహస కృత్యాలతో రెండేళ్లపాటు బ్రిటీషర్లకు కంటి మీద కునుకు లేకుండా చేశారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత నాయకత్వ లక్షణాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. అన్యాయాలను ఎదిరించి మంచివైపు నిలబడాలన్నారు. నేరాలను అదుపు చేయడానికి పోలీస్ వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. అడిషనల్ ఎస్పీ టి.పి విఠలేశ్వర్, ఎస్‌బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి మొగదారమ్మ తిరునాళ్ల



తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలో వేంచేసియున్న మొగదారమ్మ వారి సిడిమాను, తిరునాళ్ల మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఐదు రోజుల ఉత్సవాలలో భాగంగా 8వ తేదీన అమ్మవారికి పసుపు, కుంకుమ, వేపాకుతో పూతవేయటం, ప్రత్యేక పూజలు, సత్యహరిచంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన జరగనున్నాయి. 9వ తేదీన అమ్మవారికి జలక్రీడలు, పసుపు బండ్ల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, స్వాతి చినుకులు నాటక ప్రదర్శన ఉంటాయి. 10వ తేదీన శనివారం అమ్మవారిని పుట్టింటికి తీసుకెళ్లటం, అక్కడి నుంచి ఆలయానికి ఊరేగింపు, ప్రత్యేక పూజలు, న్యూ ఇండియన్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అగ్నిపుత్రులు పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటాయి. 11వ తేదీన అమ్మవారి గ్రామోత్సవం, మాధవ్ ఈవెంట్స్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో డాన్స్ కార్యక్రమం, 12 వ తేదీన అమ్మవారికి మొక్కుబడులు, ప్రత్యేక పూజలతో పాటు అన్నసంతర్పణ, మెగా డాన్స్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# అది ఆత్మహత్య కాదు..!

- నా కుమారుడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి
- క్వారీకుంటలో పడి మృతి చెందిన తేజ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు పోలీసులు



యడ్లపాడు: మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్న ప్రేమజంట ఆత్మహత్యాయత్నం ఘటనపై బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ ఘటనలో దాసరిపాలెం గ్రామానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి కొర్నెపాటి తేజ(19) కొండగట్టుపై నుంచి క్వారీనీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే తన కుమారుడిది ఆత్మహత్య కాదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తేజ తండ్రి కొర్నెపాటి మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మే 5వ తేదీ రాత్రి తేజ తన స్నేహితుడు కోటిరెడ్డితో కలిసి చౌడవరం శివారులోని ప్రైవేటు వసతి గృహంలో ఉన్న మిత్రుడి గదికి చదువుకోడానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తేజ స్నేహితులు తేజ తండ్రి మహేష్ వద్దకు వచ్చి తేజ, కీర్తనలు ప్రేమలో ఉన్నారని, పెద్దల నిరాకరణతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. వారిద్దరూ చౌడవరం బాలకుటీర్ పాఠశాల వెనుక ఉన్న క్వారీ నీటి గుంటలో దూకారని చెప్పిన స్నేహితులు, కీర్తనను అప్పటికప్పుడు కాపాడినట్లు మహేష్‌కు చెప్పారు. అయితే తేజ కనిపించకపోవడంతో తండ్రి సంఘటనా స్థలానికి చేరుకుని కుంట వద్ద తేజ చెప్పులు గుర్తించి, స్థానికుల సహాయంతో గుంటలో నీటిని తోడించగా తేజ మృతదేహం వెలికి తీశారు. ఈ సంఘటనపై తేజ తండ్రి, తన కుమారుడి మృతిపై కీర్తనతో పాటు స్నేహితులు కోటిరెడ్డి, చందులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి, పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తేజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబానికి అప్పగించారు.

# అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో పదికి పైగా కేసులు
- అతనికి సహకరించిన మరో ముగ్గురు అరెస్టు
- బంగారు ఆభరణాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.వి.చరణ్, పక్కన ఎస్ఐలు వంశీకృష్ణ, అరుణ

నరసరావుపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. బుధవారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన వెల్లలచెరువు వెంకట శివరామకృష్ణ బల్లికురవ మండలం, గుంటుపల్లి గ్రామంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో దైవదర్శనానికి వెళ్లాడు. తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాలోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇంటివద్ద లభ్యమైన సీసీ పుటేజ్ ఆధారంగా తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, బందారం గ్రామానికి చెందిన దుద్దేలింగంగా గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలిస్తుండగా అతనితో పాటు మరో ముగ్గురు చోరీ సొత్తును పంచుకుని విక్రయించేందుకు వెళుతూ రైల్వే స్టేషన్ వద్ద పట్టుబడ్డారన్నారు. నలుగురి వద్ద నుంచి చోరీకు గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో 9 కేసులు నమోదు అవ్వగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా పలు దొంగతనం కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు విచారణలో తేలింద న్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, మురళీకృష్ణలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

### గర్భిణి హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామానికి చెందిన గర్భిణి సురభి సారమ్మను హతమార్చిన కేసులో నిందితురాలైన ఆడపడుచు లింగమ్మకి జీవిత ఖైదు, జరిమానా విధించారు. ఒంగోలు అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి డి. రాజావెంకటాద్రి ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించినట్లు బల్లికురవ ఎస్సై నాగరాజు తెలిపారు. సురభి సారమ్మకు చార్లెస్‌తో 2014లో వివాహం అయింది. మద్యానికి బానిసైన చార్లెస్ తరచూ భార్యను వేధించేవాడు. అత్తింటి వారు కూడా హింసించేవారు. 2015 సెప్టెంబర్ 13న భర్తతోపాటు అత్త, మామ, ఆడపడుచు ఏసమ్మ, పున్నయ్య, లింగమ్మలు కలిసి సారమ్మను కర్రతో కొట్టి, కిరోసిన్‌పోసి నిప్పు అంటించారు. తీవ్రగాయాలైన సారమ్మ ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేసిన అనంతరం 18వ తేదీ చనిపోయింది. నిందితుల్లో అత్తా, మామ చనిపోవటంతోపాటు భర్త కోర్టు నుంచి బెయిల్‌పై వచ్చి పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో ఆడపడుచు లింగమ్మకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధించారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి



రేపల్లె: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఇసుకపల్లిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు... 17వ వార్డుకు చెందిన మోపిదేవి సుమతి (41) బుధవారం ఉదయం తన ఇంటి పెరటిలోని నిమ్మ చెట్టుకు నీళ్లు పడుతోంది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఆనుకోవటంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సుమతి భర్త నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ


నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ఎస్సీ మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఎస్సీ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఎన్‌ఏసీ శిక్షణా కేంద్రంలో ఈ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ సామాజిక మహిళలు తమ ఆధార్, కుల ధ్రువీకరణ, విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ లింక్ మొబైల్ ఫోన్‌తో ఎన్‌ఏసీ కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9394102075, 9985496190 నెంబర్లులో సంప్రదించాలని తెలిపారు.

### రెంటాలలో 22 గేదెల అపహరణ

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామంలో 22 గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున బుధవారం తెలిపారు. గ్రామంలోని కటికల సంసోన్, పేరుపోగు ఇస్రాయేల్, కటికల యేసయ్య, చిలక మరియమ్మలకు చెందిన 22 గేదెలు ఏప్రిల్ 26 వ తేదీన మేత కోసం పొలంవెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల గ్రామాలలో గాలించినా కనిపించపోవడంతో ఎవరైనా దొంగిలించి ఉంటారని నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన గేదెల విలువ సుమారు రూ. 3.90 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ముడిఖనిజం అక్రమ రవాణాపై ఫిర్యాదు

తనిఖీలు నిర్వహించిన అటవీశాఖ అధికారులు



మాలపాడు గ్రామసమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ముడి ఖనిజం

బొల్లాపల్లి: బండ్లమోటు మైనింగ్ నుంచి లెడ్, డోలమైట్ ముడి ఖనిజాలు అక్రమంగా తరలించి సమీపంలోని మాలపాడు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికంగా వచ్చిన ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ వినుకొండ రేంజ్ అధికారి సి.మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం రాత్రి 7 గంటల నుంచి 12 గంటల వరకు తనిఖీ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బండ్లమోటుకు చెందిన హిందుస్తాన్ లెడ్ జింక్ మైనింగ్ నుంచి ముడిఖనిజాలు ద్విచక్రవాహనంపై తరలించి సమీపంలోని మాలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచారని స్థానికులు కొందరు ఫిర్యాదు చేశారు. 2002 అక్టోబరులో బండ్లమోటు మైనింగ్ మూతపడింది. అప్పట్లో వేల టన్నుల లెడ్, డోలమైట్, ముడిఖనిజాల నిల్వలు బయట వదిలేశారు. ఇటీవల కాలంలో కొందరు ద్విచక్రవాహనాలపై అక్రమ మార్గంలో వీటిని తరలించి సమీపంలోని పొలంలో నిల్వ ఉంచారని స్థానికులు కొందరు మొబైల్ కెమెరాలో ఆ దృశ్యాలు తీసి జిల్లా ఫారెస్ట్ అధికారి, వినుకొండ రేంజ్ అధికారికి వాటిని పంపారు. ఈ మేరకు వినుకొండ రేంజ్ అధికారి గ్రామానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ విషయంపై వినుకొండ రేంజ్ అధికారిని వివరణ అడగ్గా స్థానికులు ఫొటోలు తీసి పంపారని, వారి ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించామన్నారు. తనిఖీలో ఆ ప్రదేశంలో ఎటువంటి ముడి ఖనిజ నిల్వలు వెలుగు చూడలేదని రేంజ్ అధికారి తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టామని ఒకటి రెండు రోజుల్లో దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని రేంజ్ అధికారి తెలిపారు. అయితే ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదని, తూతూ మంత్రంగా, నామ మాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులెత్తేశారని స్థానికులు చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ నర్సింగ్(Girls) MLT వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. 7386706839, 7780494333

REAL ESTATE
■ అమరావతి ముసుగోడు వద్ద ఎర్రవందనం చెట్లు 60 అడుగుల రోడ్డులో వెంచర్ వేసిన దానికి ప్రక్కన 1.10 సెంట్లు 80ల. 9502736614, 9949284105

SERVICES
GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకే తీసుకుంటాం. ✆ 88024 89999

HOME CARE SERVICE
■ లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము✆ 97054 91122, 94932 46482

WANTED
■ గుంటూరులోని హాస్పిటల్స్ నందు ఫిమేల్ నర్సింగ్ సూపరింటెండ్ ANM, GNM నర్సింగ్ స్టాఫ్ M/F లేడీ రిసెప్షన్ ఆయాలు యువకులు కావలెను. 7997777108
■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హోమ్ థాలి గుంటూరు నందు ఫుడ్ ప్యాకింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9505012666, 9381982818
■ మాధవి హోటల్స్ నందు షిఫ్టులు వారిగా పని చేయుటకు జెంట్స్ అండ్ లేడీస్ మేనేజర్ మరియు బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ వెంకట్. 9010453888
■ అమరావతి హైకోర్టు వద్ద గల కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 17500, 12గం।। డ్యూటీ. 9848062946, 9493803047
■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్, బ్లాక్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 21 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు ఉండవలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 9154152896
■ Wanted Male Administrative Staff Qualification Any Degree/PG. Age Limit 25 to 45years. Salary Upto: 20,000/- location: Master Minds College, Nellore. Interested Candidates may whatsapp their Resume to the Contact Number. 8978480430
■ వంటమనిషి కావలెను. గుంటూరు పట్టణంలో ఏ.టి. అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్ అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579
■ డ్రైవర్స్ కావలెను. ఆటోమెటిక్ మరియు మాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22282
■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి, చీరాల, గుంటూరు Local ఏరియాలలో పని చేయుటకు కావలెను. "Field Executives" (Salary 15K to 22K +Inct) సంప్రదించండి ✆ 92484 86177
■ గుంటూరు నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) ప్రమోటింగ్ టీం (M) కావలెను. Q: Any Degree, English Fluency is Must. అనుభవానికి ప్రాధాన్యత. జీతం: 15k to 20k. Freshers can Also Apply. ✆87499 77799
■ గుంటూరు శ్రీ శివం గ్రూప్ సంస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమరావతి రాజధాని ప్రాంతంలో వెంచర్స్‌ను మార్కెటింగ్ చేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ సిబ్బంది & ఆఫీస్ స్టాఫ్ కావలెను. ఫోన్: 98488 30615
■ విద్యాసంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అరండల్‌పేట 10 లైను, గుంటూరు. సంప్ర।। ✆ 8328639434 / 9059314217
■ దుగ్గిరాల ప్రముఖ కాఫీ పరిశ్రమకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను జీతం: 16,000/- వీక్లీ ఆఫ్, క్యాంటీన్, రూమ్ సౌకర్యం కలదు ✆ 92960 11777, 81427 61777
■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.